# సుడిగాలి

ఊరి పక్కన పొడుగాటి గట్టు, గట్టెమ్మటె రెండెకరాల స్థలంలో ఓ ఆశ్రమం. చుట్టూ రాళ్ళతో పేర్చిన గోడ. ముందువైపు నుండి గేటు. లోపల వెనక మూడు గదుల పెంకుటిల్లు, వరండా, దాని ముందు తాటాకు పందిరి. పందిరికి రెండు వైపులా మామిడి చెట్లు, వాటికి వేలాడదీసిన కుండల్లో పావురాలు ఉంటున్నాయి. ప్రతి శనివారం ఆశ్రమానికి జనం తండోపతండాలుగా వస్తుంటారు. ఆశ్రమంలో జనం బాధలను, రోగాలను దూరం చేసే మహిమ గల దేవత. ఆమెను ఎవ్వరన్నా దేవత కాదంటే కయ్యానికి కాలు దువ్వినట్టే. ఇక్కడ పదేండ్ల నుండి నడుస్తున్న జాతర యిది.

ఇప్పుడు ఆ ఊరు పెరిగిపోయింది. రోడ్లు, రోడ్ల పక్కెమ్మటి దీపస్తంబాలు. ప్రజల సౌకర్యం కోసం టీ కొట్లు, భోజన హోటల్స్ వెలిశాయి. అక్కడ టెలిఫోన్ సౌకర్యం చెప్పుగోదగ్గ విశేషం. దేశం నలుమూలల నుండి కారు, టూరిస్టు బస్సుల రాకపోకల రద్దీ అంతా ఇంతా కాదు. బట్టలు, బంగారం, డబ్బులు అన్ని అక్కడికి వరదలా వస్తున్నాయి.

వారానికి ఒకే రోజు దర్శనం. అప్పుడే పంచదార పంపకం. వచ్చిన జనం ఆశ్రమం ఎదురుగా వున్న బోరింగ్ దగ్గర కాళ్ళు చేతులు కడుక్కొని ఆశ్రమంలో అడుగు పెట్టాలి. సరిగ్గా పన్నెండు గంటలకు దేవత వచ్చి పందిరిలోని నగిషీలు చెక్కిన పీటమీద కూర్చుంటుంది. ప్రక్కనే వెండి పళ్ళెంలో ఆమె శిష్యురాలు మాయ నిలుచుంటుంది. ఒక్కొక్కరు వెళ్ళి చేతులు జోడించి నిలుచోగానే, దేవత చిరునవ్వు నవ్వుతూ, ఒకటి రెండు మాటల్లో ఆ వచ్చిన వ్యక్తి బాధలను తానే గుర్తుచేసి, నోరు తెరవమని నోట్లో చిటికెడు పంచదార పోసి వెళ్ళమనిసైగచేస్తుంది. సూర్యాస్తమయం కాగానే ఆమె ఇంట్లోకివెళ్ళిపోతుంది. వచ్చిన జనం కూడా అక్కడినుండి వెళ్ళిపోవాలని అక్కడి నియమం. ఎవరినన్నా ఉండమని ఆజ్ఞాపిస్తే తప్ప అక్కడ ఎవరూ ఉండరు. ఆ రోజు చివర్న వచ్చిన రాంరెడ్డిని పలువిధాల పరికించి చూసింది. రాంరెడ్డి పాతికేళ్ళ యువకుడు. ఆరడుగుల ఎత్తుకు దగ్గ బలమైన శరీరం. అంత బాగా ఉన్నా తల్లిదండ్రుల బాధ ఏమిటంటే, అతను సరిగ్గా తిండి తినటం లేదని, పనిపాట సరిగా చేయటం లేదని, తగిన సంబంధం కుదరగానే పెళ్ళి చేయాలని. కాని ఇంతలో ఇంత నీరసంగా ఎందుకయ్యాడో వాళ్ళకు అర్థం కాక దేవత వద్దకు తీసుకువచ్చారు.

దేవత రాంరెడ్డిని ఎగాదిగా చూసి, చేయి అందుకొని నాడి పట్టి చూసింది. ఛాతీ మీద వేళ్ళతో కొట్టి చూసింది. గోళ్ళు వత్తి చూస్తూ, ఓసారి తన కళ్ళు మూసి తెరిచింది. పక్కనే ఉన్న శిష్యురాలు అది చూసి తనలో తాను నవ్వుకుంది. దేవత అతని తల మీద చేతినుంచి 'వీడికేమైంది పోచమ్మకు వదిలిన పోతులాగున్నాడు' అనుకుంది. అప్పుడతని మాడ ఆమె

చేతికి వేడిగా తాకింది. మరొక్కసారి కళ్ళు మూసి తెరుస్తూ -

"నీకు గాలి తగిలింది. గ్రహపూజ జరపాలి. ఏడు రాత్రులు యిక్కడే నిద్ర చేయాలి"

రాంరెడ్డికి ఏం అర్థం కాలేదు. వెంట ఉన్న తల్లి తండ్రి సరేనన్నట్లు చూశారు.

"మీరు ఎవ్వరూ ఇక్కడ ఉండనక్కర లేదు" అని చెప్పింది మాయ.

"సరే అన్నట్లు" తలూపి అక్కడనుండి కదిలారు.

రాంరెడ్డి మౌనంగా ఉండిపోయాడు.

దేవత లోనికి వెళ్ళిపోయింది.

అప్పుడప్పుడే వెన్నెల పర్చుకుంటుంది. గేటు మూసి తాళం వేసి వస్తున్నాడు ఆశ్రమ కాపలాదారు రాజయ్య. తనను ఎందుకు ఇక్కడికి తీసుకు వచ్చినట్టు అని రెడ్డి పందిరి కింద కూర్చుని ఆలోచిస్తున్నాడు. కుండలో పావురాలు ఒకదానిని ఒకటి స్పర్శిస్తూ మూలుగుతున్నాయి. ఆ శబ్దాలలో పక్షుల ప్రేమా అనురాగాలు ధ్వనిస్తూ ఉన్నాయి.

అప్పుడే బయటకు వచ్చిన దేవత గాలిలో తేలిపోయే వెన్నెలకంటే తెల్లని జుబ్బా, పాదాలకు ఆకు చెప్పులు ధరించింది. చివరన ముడివేసి వదిలిన నల్లని కురులు. జుబ్బాను పైకెత్తి పట్టిన ఆమె ఎద. రెడ్డి అటువైపే చూస్తూ రెప్పలు కొట్టటం మానేశాడు. దేవత మాయతో ఏదో మాట్లాడుతూ, కాసేపు అటూ, ఇటూ తిరిగి వెళ్ళింది. ఆ ప్రౌఢ అక్కడ తిరిగినంతసేపూ ఆమెనే చూసిన రెడ్డి ఆమె లోపలికి వెళ్ళగానే మళ్ళీ తనకేమయిందని యిక్కడికి తీసుకువచ్చారు. నిద్రలో పాడు కలలు వస్తున్నవనా, కలలొస్తే? కలలు రాకూడదా? యింతకు ముందు వెన్నెల్లో తిరిగిన ఆమె కలలో వచ్చిన వాళ్ళలాగే అనిపించి, కాసేపు కళ్ళు మూసుకొని ఆమెను తలుచుకున్నాడు.

రెడ్డీ ఎంతో పరిచయమున్న వాన్ని ప్రేమతో పిలిచినట్లు పిలుపు.

"హ" చికాకు ధ్వని.

"చలిగా ఉంది కదూ, లోపలికి రా"

లేచి గదిలోకి నడిచాడు. అతనికి గదంతా వెచ్చగా అనిపించింది.

ఎదురుగా టీపాయ్ మీద పానియం నింపిన గ్లాసు ఉంది. పక్కన పళ్ళెంలో తినుబండారాలున్నాయి.

కూర్చోమని సైగ చేసింది మాయ. అక్కడున్న సోఫాపై కూర్చున్నాడు. ఎదురుగా టీ.వీ.లో నీలి చిత్రం నడుస్తూ ఉంది.

వీళ్ళుకూడ యిట్లనే బరిబత్తల కనిపిస్తే - అనుకుంటుండగా గాజుల చేతులు గ్లాసు అందించగా ఆ చేతుల వైపే చూస్తూ అందుకున్నాడు. వేళ్ళమీద వేళ్ళు, శరీరాల్లో స్పర్శా

తరంగాలు.

ఆ రాత్రి ఆ గదిలోకి నిద్ర రాలేదు. ఉదయం సూర్యకిరణాలతో పాటు ఓ తూనీగ ఎగిరొచ్చింది. దానిమీద మరో తూనీగ. అది చూసి వాళ్ళు అట్లాగే వుండిపోయారు.

రెండవ రోజు పగలు - రాత్రికి తేడా చెరిగిపోయింది. చందనపు స్నానాలు, పండ్లు, పానీయాలు. ఆ ఐదు రోజులూ అంతే.

మాయ మాత్రం చెప్పలేని చిరాకుతో కస్సుబుస్సులాడింది. రాజయ్యను రాచిరంపాన పెట్టింది. రెడ్డి ఇప్పుడు ఎంతో ఉల్లాసంగా ఉన్నాడు. క్రితంలోని బిత్తర చూపులు లేవిప్పుడు. ఆరవరోజు సాయంకాలపు సంధ్యలో మాయ పావురాలకు గింజలు చల్లుతూ ఉంది. దేవత ఓ మగ పావురాన్ని అరచేతిలో కూర్చోబెట్టుకొని చేత్తో రెక్కల్ని నిమురుతూ పందిట్లో నిలుచుంది.

" ఇక ఆ పావురాన్ని వొదిలెయ్యి " నర్మగర్భంగా అన్నది.

" తొందరెందుకు " ఎవరి గురించి అంటున్నవో తెలుసు అన్నట్టు చూస్తూ అన్నది.

" కొన్నిట్లో తప్పక తొందరపడాలి "

" ఎందుకు "

పావురం తల మీద ఉన్న జుట్టును వేలితో రాస్తూ ఆ వేలునే చూస్తూ నిలుచుంది దేవత.

" వీలయినంత త్వరగా వదులుకోవాలి. ఇక్కడినుండి పోయినంక మన రహస్యం బయటపడితే " అంది మాయ.

" చెప్పడు. అతను చేసిన పనులన్నీ మైకంలో చేసినవే. అప్పటి ఆనందమే తప్ప ఆ తరువాత ఓ అనుభవంగా మిగలదు. మనమిచ్చిన పానీయపు ప్రభావం అటువంటిది " అంటూ తన్మయత్వంతో కళ్ళు మూసుకొని తెరచింది.

అప్పుడు ఆమె కళ్ళలో ఏదో తృప్తి తొణికిసలాడగా పావురాన్ని బుగ్గకు అదుముకుంది. పావురం మెచ్చుగా తాకింది. ఆ వత్తిడికి పావురం బిత్తరగా చూసింది. ఏదో గుర్తుకు రాగా ముసిముసిగా నవ్వుతూ పావురాన్ని ఎగురవేసి ఇంట్లోకి నడిచింది.

తెల్లారి సూర్యుడు బారెడు ఎక్కాడు.

అలసిన శరీరం సుఖనిద్రలో కుదురుకోగ వొళ్ళు విరుచుకుంటూ లేచిన దేవత, ఎవరూ కనిపించకపోయేసరికి చికాకుగా పందిరి దాటి వచ్చి బయట నిలుచుంది. మాయ మల్లె పొదనుండి పూలు తెంపుతుంది.

"అతనేడి "పాదాలకు అడ్డు వస్తున్న జుబ్బాను పైకెత్తి పడుతూ అడిగింది.

"వెళ్ళిపోయాడు " అందని పూలను వదిలేసి అందినవాటని తెంపుతూ అంది.

" నీవే పంపించి వుండవచ్చు." కోపంతో ముఖం ఎరుపెక్కింది.

" దేనికైనా హద్దు ఉండాలి. " నిశ్చలంగా, నిబ్బరంగా అంది.

" నాకే హద్దు పెడుతున్నావా " గొంతులో తీవ్రత ధ్వనించింది.

"అదుపు తప్పుతున్నప్పుడు హద్దులు అవసరం. లేకపోతే గుట్టు రట్టయితది " తెగేసినట్టు అంది మాయ.

"రాజయ్యతో నీగుట్టు రట్టు కాదా "కళ్ళు పెద్దవి చేసి అంది.

" ఇంటిదొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడని ఎప్పుడూ వినలేదా."

తట్టుకోలేని కోపంతో పెదవులను బిగించి వదిలి చికాకుగా అటు యిటు తిరుగుతూ, చిందర వందరగా వున్న కురులను సరిచేసికొని కొప్పుగా ముడుచుకుంది.

"మనం ఆశ్రమాన్ని కాపాడుకుంటే ఇది మనల కాపాడుతుంది. "

" తెలుసు నీవేమీ చెప్పక్కర్లేదు అంటూ లోపలికి నడిచింది " చిరాకుగా.

పాలు పిండుతున్న రాజయ్యవైపు నడిచింది మాయ. రాజయ్య పాల చెంబును మోకాళ్ళ మధ్య పెట్టుకుక్కూర్చుని ఆవు పొదుగునుండి పాలు పితుకుతూ వున్నాడు.

"యింకా కాలేదా అంది."

"చూస్తూనే ఉన్నావుగా " చెంబులో పడుతున్న పాలధార చూస్తూ అన్నాడు.

"అన్నీ చూస్తూనే ఉన్నా " నర్మగర్భంగా అంది.

"కొన్నిటిని వదిలేయాలి "పొదుగులోని పాలను పూర్తిగా పిండకుండా దూడ కోసం వదులుతూ అన్నాడు.

"నీవు దానిని వెనకేసుకొస్తున్నావా "నిష్ఠూరంగా గునిగింది.

"తప్పు అట్లనద్దు, దేవత."

" ఎవరు చేసిన దేవత ? " రాజయ్య కళ్ళలోకి చూస్తూ రోషంగా అడిగింది.

" ఓసీ పిచ్చిదానా, మనిషి బొమ్మను చేస్తాడు. ఆ బొమ్మకే తాను మొక్కుతాడు. నలుగురితో మొక్కిస్తాడు. పదిమంది దేవుడంటే, దేవుడే. అంతే కాదు, కట్నాలు కానుకాలు సమర్పిస్తారు. "

"అసలు సంగతి బయటపెడితె - కానుకల సంగతి కానవస్తది " అంది కసిగ.

"నడువ్, నడువు, పాలను దాలిలో పెట్టుపో " అంటూ పాల చెంబును అందించి గేటు వైపు నడిచాడు. కోపంతో నడుస్తున్న మాయకు గతం మదిలో మెదిలింది.

* * *

మిట్టమధ్యాహ్నం - ఎర్రటి ఎండ.

ఊరి బయట వేపచెట్టు నీడన ఓ యువతి సొమ్మసిల్లి పడివుంది. అప్పుడే పట్నం

నుండి వస్తున్న మరో స్త్రీ ఆ చెట్టు నీడకే వచ్చి నిలుచుంది.

ఆ యువతి మూల్గుడు విని, సమీపించి చూసింది. వళ్ళంతా చెమట పోసి , కళ్ళు గుంజుకపోయి, కడుపు వెన్ను అంటుకుపోయి వుంది. తిండిలేక ఎన్నిరోజులో, దూప, దూప అంటూ చేతులను మూతి దగ్గరుంచి సైగతో అడిగింది.

ఆమె అటు ఇటు ఆమె పక్కన కూర్చుని మెడ కింద చేయి వేసి చెట్టు మొదట కూర్చొబెట్టింది. తన సంచిలో నుండి కమలా పండును తీసి ఒలిచి ఇచ్చింది. వాటిని చప్పరించగానే నోరు తడి అయి మాట పెగిలి ఏదో గునిగింది.

ఈమె కట్టుబట్టలతో మాత్రమే ఎక్కడినుండో వస్తున్నట్టుంది. రెండే రెండు గాజులు తప్ప కాళ్ళకు మట్టెలు లేవు. మెడన పుస్తె లేదు. పెళ్ళికానట్టా అనుకుంటూ కొంగును తొలగించి బొడ్డు చుట్టూ చూసింది. పాతికేండ్లు పైబడ్డా యిప్పటి వరకు పిల్లా జెల్లా కాలేదన్నమాట అని అనుకుంది.

కళ్ళు తిరుగుతున్నాయి అని తలను ఆమె ఒడిలో వాల్చింది.

“ఏం కాదు, కాసేపు కళ్ళు మూసుకో ” అంటూ తలను నిమిరింది. ఆ స్పర్శతో కాస్త తేరుకుంది.

“ ఏం పేరు ”

“ సుశీల ” అంటూ మెల్లగా లేచి చెట్టుకు జారగిలబడి కూర్చుంది.

“ ఎక్కడి నుండి వస్తున్నవు. ”

“కరీం నగర్ నుండి కాలి నడకన వస్తున్న. పెండ్లి అయ్యి పదేండ్లు అయినది, గానీ పిల్లలు కాలేదని కోపంతో మా ఆయన ఎల్లగొట్టిండు. మా అవ్వ ఇంటికి పోతే వాళ్ళు మా ఇంటికి రావద్దన్నరు. ఎక్కడన్న పోయి కూలి నాలి చేసుకొని బతుకుదామని వొస్తున్న ”. మాటలు నూతిలో నుండి వచ్చినట్టు వినిపిస్తున్నాయి ఊళ్ళోనుండి ఇద్దరు రోడ్డు వైపు వస్తున్నారు. నుదుట విభూతితో శాస్త్రి ఒకరు, అజానుబాహుడు భుజాలమీద గొడ్డలితో మరొకరు. వాళ్ళు దగ్గరవుతుంటే సుశీల ఎందుకో భయంతో బిత్తర బిత్తర చూస్తూ ఉంది. వాళ్ళు పూర్తిగా చెట్టు కిందికొచ్చి నిల్చున్నారు.

సుశీల కాళ్ళు చేతులు వణికి, కళ్ళు మూతలు పడి చెట్టు మొదటె పడిపోయింది. “ఏమిటే మారి ఎవరు ఈమె ” అడిగాడు శాస్త్రి .

ఇద్దరిదీ అదే వూరు కనుక ఆమె పేరు ఆయనకు తెలుసు. ఆమె చిన్న వయసులోనే భర్త పోవటం వలన పట్నంలో కూలీనాలి చేసుకుంటున్నది. అప్పుడప్పుడు వచ్చిపోతుంటుంది.

“ ఎవరో పాపం సొసొచ్చి పడివుంది పంతులు ” అంటూ లేచి నిల్చుంది.

“ హారీ, దీని ముఖం కాంతివంతంగా వుంది. విగ్రహం పోత పోసినట్లుగా వుంది. దైవకళ వుట్టిపడుతుంది. ” అంటూ శాస్త్రి కాసేపు ఆలోచిస్తూ నిలుచున్నాడు.

శాస్త్రి బుర్రలో ఓ ఆలోచన మెరిసింది.

“ మారీ దీనిని చూపించి మనం సుఖంగా బతకొచ్చు ” అన్నాడు.

“అరె రాజిగా ఇటురా ” అని చెవిలో ఏదో చెప్పాడు.

రాజయ్య మారమ్మ దగ్గర పది రూపాయలందుకొని ఊళ్ళోకి వెళ్ళి నిమిషాల్లో పూజ సామానుతో పాటు ఊరి పెద్దలని కొందరిని వెంటపెట్టుకొని వచ్చాడు.

సుశీల వాళ్ళందరిని చూసి మరింత వణికిపోయింది.

శాస్త్రి గారు సాంబ్రాణి పొగ వేసి కొబ్బరి కాయ కొట్టాడు. అది ఊరంతా తెలిసి , ఊరి బయట గణాచారి వెలిసిందని తలా ఓ కొబ్బరికాయతో వచ్చారు.

అందరూ శాస్త్రిగారిని, శాస్త్రిగారి పూజలను నమ్మారు.

రోజులు గడుస్తూ ఉన్నాయి. వొచ్చిన వాళ్ళ రోగాలు, నొప్పులు బాగవుతూ వున్నాయి. అక్కడ ఆశ్రమ స్థాపన జరిగింది. జనం రాకపోకలు పెరిగాయి. రాను రాను గణాచారి దేవతగా స్థిరపడింది.

ఇక రాజయ్య ప్రతి శనివారం పొద్దటి పూట బోరింగ్ దగ్గరకు వచ్చే జనం కాళ్ళు చేతులు కడుక్కోవటం కోసం బోరింగ్ కొడుతూ వాళ్ళను మాటల్లోకి దింపుతాడు. ఆ తరువాత దేవతతో అన్ని సుద్దులు మాట్లాడతాడు. పగలు గేటు దగ్గర ఉండి, ఒక్కొకరిని లోపలకు పంపుతూ ఉంటాడు. మిగతా రోజులలో ఆశ్రమ పనిపాటలు చూస్తూ అక్కడే వుంటాడు. ఆయనకు భార్యాపిల్లలు లేరు.

దాలిలో పొంగుతున్న పాలు మాయను ఈ లోకంలోకి తెచ్చాయి. వెంటనే పాల కింద సెగను తగ్గించింది. మాయను మందలించి గేటువైపు నడుస్తున్నప్పుడు శాస్త్రిగారు గుర్తొచ్చారు. నాడు నాలుగు అక్షరాలను చెప్పి హోమియో వైద్యం నేర్పబట్టేకదా ఈ కథ కమ్ముతూ వస్తుంది.

ఎందిరితోనో మాట్లాడి, ఎన్నో రోగాల గురించి తెలుసుకున్న రాజయ్య తెలుసుకుంది మనుషుల్లో అన్నిటికంటే పెద్ద బలహీనత భయం అని. దాని నుండి తప్పించుకోవటానికే ఈ భజనలు. ఈ విపరీత చేష్టలు.

* * *

ఇద్దరు వ్యక్తులు బోరింగ్ దగ్గర కాళ్ళుచేతులు కడుగుతూ ఉంటే రాజయ్య మాటల్లో దించే ప్రయత్నం చేస్తున్నాడు. వాళ్ళు రాజయ్యను ఎగాదిగా చూస్తూవున్నారు తప్ప నోరు విప్పడం లేదు. ఒకరికి నలభై ఏళ్ళు ఉంటాయి. మరొకడు ఆయనకంటే ఐదారేళ్ళు చిన్న

వున్నట్టుంది.

మాట్లాడకపోయేసరికి రాజయ్యకు అనుమానం వచ్చింది. మారువేషంలో ఉన్న పోలీసులు అనుకొని వెళ్ళి దేవతకు చెప్పాడు. దేవత మాయని అనుమానించింది. లోపలికి రాకుండా వాళ్ళను అక్కడే ఆపివేయాలని నిర్ణయించుకుంది.

సరే అన్నట్టు తలూపింది మాయ. అదో మాదిరిగా స్పందిస్తూ. ఈలోపు వాళ్ళు పందిట్లోకి రానేవచ్చారు. దేవత చూపులను వాళ్ళమీద నిలిపింది. జ్ఞాపకాలు తెరలు తెరలుగా కళ్ళముందు రాసాగాయి. వాళ్ళు చుట్టూ కాసేపు చూసి, తర్వాత దేవతమీదే దృష్టి నిలిపారు.

"ఓష్ ఈమె కథే మారిపోయిందిగా " అంటూ కనుబొమలను కదిలించాడు మొదటి వ్యక్తి.

"వరేవా సుశీల భలే ఎత్తు వేశావే. ఊళ్ళో ఉన్నప్పుడు గుండ్ల చాటున, చెట్ల చాటున దాక్కొని నా కోసం ఎదురుచూసే దానివి " అని అనుకున్నాడు రెండవ వ్యక్తి.

"పూర్తిగా మారిపోయావు. ఎన్ని భాదలు పెడితివి. ఎన్ని గుద్దులు తింటివి. ఆఖరికి దేవతగా మారినావు " అనుకున్నాడు మొదటి వ్యక్తి.

చాలాసేపటికి గానీ సుశీల వీళ్ళను పోల్చుకోలెదు. వాళ్ళ వేషభాషల్లో ఏమీ మార్పు రాలేదు. మొదటివాడు తన భర్త, రెండవ వాడు తనంటే పడి చచ్చేటోడు.

ఇద్దరు కలసి వచ్చారంటే తనను ఏదో చేయడానికి వచ్చారన్నమాట. వాళ్ళకు నా సంగతి ఎట్లా తెలిసింది.? అనుకుంటున్నప్పుడే కళ్ళు తిరిగితే, తల పట్టుకుని కుర్చీలో కూర్చుంది.

మాయ వచ్చి వెనుకనుండి నిలుచుండి కుర్చీని కదలకుండా పట్టుకుంది.

అది చూసిన రాజయ్య పరుగుపరుగున వచ్చి ఇద్దరూ కలసి దేవతను గదిలొకి తీసుకువెళ్ళారు.

ఆ తరువాత రాజయ్య బయటికొచ్చి కొలువు ముగిసినట్లుగా చెప్పి అందర్నీ వెళ్ళిపోవలసిందిగా కోరాడు. అందరూ వెళ్ళిపోతూవుంటే ఆ ఇద్దరూ మాత్రం కదల్లేదు. అంతేకాదు, ఆశ్రమాన్నే చూస్తూ ఉన్నారు.

" మీకే చెప్పేది వెళ్ళండి " అన్నాడు రాజయ్య.

అప్పుడే గదిలో నుండి బయటకు వచ్చిన మాయ వైపు చూశారు.

అది గమనించిన మాయ -

" రేపు కొలువుండదు. ఎల్లుండి రండి " అని చెప్పింది.

" సరే " అన్నట్టు తల ఊపి వెనక్కు మళ్ళారు. కొంత దూరం నడచి, పక్క సందులో మడత మంచాలు అద్దెకిచ్చే ఓ ఇంట్లో చేరారు.

సాయంత్రం సరుకులకని బయటకు వచ్చిన మాయ సుశీల మగనితో కలసి పక్కనే

ఉన్న టౌనుకు వెళ్ళింది. లాడ్జింగ్‌లో గది తీసుకొని తినిపించి, తాపించి , ఏమో నేర్పించింది, ఆ రాత్రి, మరునాడు కూడా ఎట్లనైనా సుశీలను హతమార్చాలని వాళ్ళ పన్నాగం.

" నీ పెండ్లాన్ని నీవు తీసుకునిపోయి ఖతమన్నా చేయి " అంది మత్తులో తూలుతూ.

" ఏదోవోటి చేస్తగానీ, మరి నా ఆస్థి సంగతి ? అని అడిగాడు. తాగినా ఆస్తి విషయం మరువలేదు.

"ఆస్తా, ఆస్తి నాది, నా రాజయ్యది. మేము పెంచింది మాకే వుంటుంది. ఏదో మీకూ కొంత ఇస్తామనుకో."

" సరే, అంతే " అన్నాడు.

" ఒరే నీ పేరేమన్నావు ? " అంది మత్తులో తూలుతూ.

"లింగం" అన్నాడు.

అదివిని మాయ పకపక నవ్వి " లింగం అంటే ఏందో తెలుసా "అంది.

"తెలువదు " అన్నట్టు తలాడించాడు.

ఓ కన్ను మూసి తెరిచి తన చూపుడు వేలును కదిలించి చూపించింది. ఇద్దరూ కాసేపు నవ్వుకున్నారు. ఒకరిని మరొకరు సుతారంగా కొట్టుకున్నారు.

చీకటి పడింది. టాక్సీని పిలిచి వెళ్ళవలసిన చోటు చెప్పి కూర్చున్నారు. గంట ప్రయాణించిన టాక్సీ ఆశ్రమం ముందాగింది. టాక్సీ డబ్బులిచ్చి -

"ఈయనను మడతమంచాల కాడ వదిలిపో " అంటూ చెప్పింది. గేటు దగ్గరే ఉన్న రాజయ్య ఆమె వాలకాన్ని గమనించి లోనికి తీసుకువెళ్ళాడు.

తాగిన మైకం ఇంకా దిగలేదు. తూలి రాజయ్య మీదికి వాలింది. పందిరి కింద నిలుచుని అన్ని చూస్తున్న దేవత టాక్సీవాన్ని రమ్మని సైగ చేసింది. అతను పందిట్లోకి రాగానే ఎదురెళ్ళి మాట్లాడింది.

మాయ రాజయ్యను కదలకుండా వాటేసుకొని తన పక్కన్నే పడుకోబెట్టుకుంది. తెల్లారేసరికి దేవత ఆశ్రమంలో లేదు. బట్టలు, బంగారం టాక్సీలో పట్టినన్ని పట్టుకెళ్ళింది. తెల్లవారగానే ఈ వార్త ఊరంతా తెలిసిపోయింది.

విషయం తెలుసుకున్న రాజయ్య మాయను తిట్టాడు. మాయ రాజయ్యను తిట్టింది. సుశీల భర్తకు ఏమీ అర్థం కాక అయోమయంగా చూస్తూ నిలుచున్నాడు. తనవెంట వచ్చిన తన ఊరి మనిషి అలాగే నిల్చున్నాడు.

డిసెంబర్ 99 ●